# చెదిరిన హృదయం

రచన :
తున్మలపల్లి బాలకృష్ణ

వెన్నెలరేడు నీలి ఆకాశంలో తారలతో సహా మహా వైభవంగా విహరిస్తున్నాడు. చంద్రుడు మహోజ్వలమైన వెన్నెల కాంతిని భూమిపై వెదజల్లి యువతీ యువకుల జీవితాన్ని ఉవ్విళ్ళూరిస్తున్నాడు. నీలి మేఘాల చాటున దోబూచులాడుతూ తారల అందాన్ని తొంగి తొంగి పరీక్షిస్తున్నాడు.

ప్రశాంతమైన ప్రపంచానికి చడీ చప్పుడూ లేకుండా చల్లని వెన్నెలలిచ్చి ప్రేమికుల మధ్య రగుల్కొన్న ప్రేమ వృష్టులను ప్రసరింప జేస్తూ రతీ మన్మధుల వలె ప్రేమాంకురాల్ని మరింత బలపరుస్తున్నాడు. నిర్మలమైన ప్రపంచ బాహువుల్లో కోట్లకొలది జీవులు నిద్రిస్తున్నారు. అమాయిక జీవులు జీవితంలో ఎన్నెన్ని కష్టాల్ని పోరాడుతున్నారో!! క్రొద్ది సేపట్లోనే వున్నట్టుండి, దోబూచులాడుచూ ప్రపంచాని కంతటికే శాంతిని గొల్పిన చంద్రుడూ, తారల మధ్య నున్న తారతమ్యాన్ని తెగత్రెంపులుగా పెను తుఫాను ఒక్క సారిగా ప్రణయ క్రీడను మటుమాయం జేసింది. ఏమటీ విపరీతం!!! జీవిత వ్యవస్థలో యిలాటి సంఘటన లెన్నో సంభవిస్తాయి గాబోలు! మానవుడు తన శక్తి నంతనీ వినియోగించి తాను గట్టుకున్న గాలి మేడలను రాతిగోడలుగా నిర్మించాలనుకుని విధి కెదురుగా పెను తుఫాను నుండి బయకపడ ప్రయత్నిస్తున్నాడు. విధి అనుగ్రహిస్తే మానవుడు తప్పకుండా నెగ్గుతాడు.

జగదీశ్ చంద్రుడు ఆకాశంలోకి జూస్తూ మౌనము గ్రహించి భావ వీధుల్లో ప్రచారం జేస్తూ యీజీచైరులో కూర్చుని వున్నాడు. పండు వెన్నెలలో ఎదురుగుండా అనేక గృహాలు కన్పిస్తున్నాయి. దే దీప్యమానంగా వెలిగిన ఆ భవనాలు నిశేథ సమయంలో మరింత అందంగా వున్నాయి. దూరంగా వున్న దీపకాంతులు మిణుకు మంటూ అర్ధ నిమీలింగా వున్నాయి. జగదీశుని ముఖ వైఖరిని గమనిస్తే విషాద రేఖలు దట్టంగా క్రమ్ముకున్నట్లు తారసిల్లుతోంది. పక్షుల కలకలా రోదనలో యీతని హృదయం మరింత భాద పడుతున్నది. రాత్రింబవళ్లు నిద్రలేక అతని ముఖం చిక్కి శల్యంగా వుంది. అతడి చెక్కిళ్ళ వెంబడే అశ్రుధారలు సెలయేరులా ప్రవహిస్తోంది.

గడచిన రోజుల ఫలితంగా జగదీశుని జీవితం దీన దశకి వచ్చింది. తత్ఫలితంగా అతని మనసులో పెద్ద గాయం ఏర్పడింది. హృదయా వేదన చల్లారటం ఎప్పుడో! అమాంతంగా "వసుమతీ! అన్నాడు. "అబ్బా!" అన్నాడు ఏదో బాధపడుతున్నట్లుగా పాపం! హృదయా వేదన! ఎవ్వరీమె? అతని దీన వదనాల్ని జూచి జాలి పడేవారు లేరు గాబోలు!!!

వెనుకటి జీవితంలో తానుపొందిన అత్యానందం అతని కంటికి దృశ్యాల్లా కనుపిస్తున్నాయి. ఆనాడు తాను విహరిస్తున్న సుందరోద్యానం! ఎంత అందంగావుంది. పచ్చని ఆకులతో ఆ తోట అద్భుతంగావుంది. కోయిలల 'కుహూ కుహూ'లు వసంతా గమనాన్ని సూచిస్తున్నట్లుంది. ఉద్యానవనం ప్రక్కగానే ప్రవహిస్తోందో నది మెలికలు తిరిగి తన వంపుసొంపులను ప్రదర్శిస్తూ. నిర్మలమైన నదీఒడ్డున ఎంతోమంది మానవులు చల్లని పిల్ల వాయువుల నాఘ్రాణిస్తున్నారు. సంధ్యారాగం సూర్యణి తనలో కలుపుగోటానికిగాను ఆహ్వానిస్తోంది.

వెన్నెలలు విరజిమ్మాయి. ప్రజలు తమతమ గృహాలకు దారితీశారు. నిర్జనమైన ఆ ప్రదేశంలో ఒకానొక వ్యక్తి చెట్టునానుకుని కూర్చున్నాడు. కొంత సేపలా ఆలోచించి లేచి బయలుదేరాడు. పక్షుల కలకలరావాలు తనను ఆహ్వానిస్తున్నట్లుగా భావించాడు. అతడు మెయిన్ రోడ్డునుండి సందుతిరిగాడు. వెన్నెల పిండారబోసినట్లుంది. వెన్నెలలో అతని ముఖం చంద్రునిలావుంది. దివ్యభవనాల నొక్కొక్కటే దాటాడు. మరొకవంపు తిరిగాడు. ఒక యింటిముందు ఆగాడు. అదొక దేవేంద్ర భవనం. బయట 'గార్డెన్సు'లో అనేక రకాల పూల మొక్కలున్నాయి. ఇంతలో కుక్క "భౌ! భౌ" మని అరిచింది. అరిచిందే తడవుగా తలుపుతీయబడింది. జగదీశుడు ఆ భవనంలో ప్రవేశించాడు.

(తరువాయి 23 వ పేజీలో)

(6 వ పేజి తరువాయి)

భవనాంతర్భాగాన వున్న విద్యుద్దీపాలు మిరిమిట్లు గొల్పుతున్నట్లు ప్రకాశిస్తున్నాయి. జగదీశుడు భవనాన్ని తిలకిస్తున్నాడు. "మీరింత ఆలస్యంగా వచ్చారేం" అన్న మాటలు అతన్ని వులిక్కిపడేటట్టు చేసింది. ఆమె నవ్వుతుంది. నవ్వుతున్నప్పుడామె ముఖం పద్మం విప్ఫారినట్లుస్ఫురిస్తుంది. నవ్వుతున్నప్పుడామె పాలరాతిచెక్కిళ్లు ఎంతో అందంగా వుంటాయి. గిరజాలు తిరిగిన జుట్టు తుమ్మెదలావరించాయా అన్నట్లుంటుంది. జగదీశుడు తేరుకుని "ఆ అవును" అన్నాడు. నవయౌవన సుందరాంగి అయిన ఆమె "అలా నుంచున్నారేం కూర్చోండి" అంది వయ్యారంగా.

జగదీశుడు చిరునవ్వు నవ్వుతూ సోఫాపై కూర్చున్నాడు. ఆ రోజున కలిగిన ఆనందానుభూతి తానెన్నడూ కలలోనైనా అనుకోలేదు. కాని విధి తనకు జూపిన దారిని విడువలేక పోయాడీరోజు.

వారిద్దరిమధ్యనున్న చనువూ, స్నేహంవల్ల వారిరువురూ హేళనగా మాట్లాడుతుంటూంటారు.

" 'అపరస్వర్గం' అనిపించే యీ భూతలస్వర్గం...?"

"మీకెప్పుడూ వేళాకోళాలే" అంటూండగానే ఆమెముఖంఎర్రబడింది. జగదీశుడు నివ్వెరబోయాడు. తాను పొరపాటు చేశాడు ? స్నేహం అయితేమాత్రం అలా అనడం భావ్యమేనా ? అతనిలోని నవనాడులూ కృశించి కృంగిపోయాయి. ఆలోచిస్తున్నాడు కర్తవ్యాన్ని గురించి. కొంత సేపటి కాతడులేచి "వసూ! వెళ్లొస్తా" నంటూ మెల్లగా వెన్నెలలో కలిసిపొయ్యాడు.

మౌనంధాల్చిన దేవతామూర్తి ప్రకృతివైపు చూస్తోంది. జగదీశుడన్నమాటలనైనా ఆమె వినలేదు. చంద్రుడు బిత్తరపోతూ ఆకాశంలో త్వరగా ప్రయాణిస్తున్నాడు. తారలు అచలత్వంతో స్థిరంగా వున్నాయి. "అమ్మగారూ!" అన్నమాట ఆమెకు వీపుమీద చరచినట్లయింది. భావనా ప్రపంచం ఒక్కొక్కప్పుడు భయంకరంగాను మరొకప్పుడు ఆనందంగానూ వుంటుంది గాబోలు! వెనుదిరిగి చూసింది. ఏడీ జగదీశ్ ! నిరాశ! నిస్పృహ! జీవితంలో యిటువంటి నైరాశ్యానెందుకు కలుగజేశాడీ భగవాన్ ? మానవులు తమ కోరికల సాఫల్యంకోసం ఎంతగానో ఆశిస్తారు. విధికెదురు పోరాడుతారు. ఆఖరికి యిచ్ఛా సఫలీకృతులు కాకపోయినప్పటికీ వెనుదీయరీ మానవకోటి! జీవితాన్ని సైతం తెగిస్తారుగానీ——?"

"అమ్మగారూ ! ఏమిటాలోచిస్తున్నారు" అందో లాలనకంఠం. "ఆ!" వులిక్కిపడ్డది స్వరం. "ఏమిటన్నావు ?" అన్నదా స్వరం. నివ్వెరపోయిన ఎదుటి వ్యక్తి "ఏదో ఆలోచిస్తున్నట్లున్నారు. భోజనం చెయ్యండమ్మా !" అంది ఆప్యాయంగా. "ఆ! వదవస్తున్నాను" అని జవాబు. యధాప్రకారంగా దాసీది భోజనాన్ని సిద్ధపరిచి వెళ్ళిపోయింది. భోజనం ముగించిన పిమ్మట మేనువాల్చింది.

ఆమె కళ్లలో మెరుస్తున్నాయి దివ్యజ్యోతులు. తన





అత్యంతాకర్షనీయమైన
గానలహరితోనిండిన
గోకుల్ ప్రొడక్షన్స్‌వారి
"కనకతార"
పాటలను
"మెలొడీ రికార్డు" లలో
వినండి
హచిసన్ & కో
మద్రాసు-1

నేత్రాల్ని తానే నమ్మలేకుండా వుంది. ఆకాశంలో దట్టంగా మేఘాలు ఆవరించాయి. వాయువు భీతావహంగా భీభత్సరూపం దాల్చాడు. విహాయసంలో విహరించే తారాచంద్రుల జాడలేదు. శంకరుడు విలయ తాండవం చేస్తున్నాడు. ప్రళయం! ప్రళయం! మెరుపులు ఆరనిజ్యోతుల్లా ప్రకాశిస్తున్నాయి. అయ్యో! తుఫాను. సముద్రంలో ప్రయాణిస్తున్న నావలన్నీ ఒక్కసారిగా, కెరటాల్లో కలిసిపోయాయి. సముద్రంలో మునిగి తేలుతున్న ఆ వ్యక్తి ఎవరు? జగదీశుడా! "జగదీశ్! జగదీశ్!" అంటూ కేకలు వేయడం ప్రారంభించగానే ఆమెకు మెలకువ కలిగింది. ఆమె నేత్రాలు చెమ్మగిల్లాయి. స్వప్నంనుండి తేరుకోగానే ఆకాశమంతా నిర్మలంగావుండడం ఆమె గమనించింది.

జగదీశుని స్తుతి ఆమెను హతమారుస్తూ హృదయాన్ని గాయపరుస్తోంది. ప్రపంచంలో నివసిస్తున్న కోటానుకోట్ల ప్రజలలో తాను జూస్తున్నవ్యక్తి ఆమె దేవతామూర్తి. జగదీశుని గురించి ఆమె కెందుకీ ఆలోచనలు? అమానుషమయిన ఆ వ్యక్తిపై తనకెందుకింత మమత? తాను అతడ్ని ప్రేమిస్తోందా? ఛ. అదేమిటి? ఏం ప్రేమించకూడదా? రూపాన్ని జూసి మోసపోయిందా! కాదు అతడు తనకిచ్చిన ప్రేమ!

సైరను కూయడమే తడవుగా ఆమె ఆలోచన లన్నీ తెగ త్రెంపులయ్యాయి.

జగదీశుడు ఆమెనుండి శలవు తీసుకుని వెళ్ళాడు. అతడు దిగాలు పడి గదిలో కూర్చుని వున్నాడు. తాను గావించిన చర్యకు సిగ్గుపడ్డాడు. కాదు భాద పడ్డాడు. తానొక ఏకాకి. సామాన్య మానవుడు. తల్లి దండ్రులు ఆస్తిపరులైనప్పటికిన్నీ తాఁజేసిన పాపకార్యం వల్ల అంతటినీ కోల్పోయాడు. తండ్రి మరణ శయ్యపై నున్నపుడు జగదీశుణ్ణి, అతడి ఆస్తినీ మేనమామకు వప్పజెప్పి పరలోకం జేరుకున్నాడు. తల్లి బాల్యంలోనే స్వర్గం జేరింది. కాని దురదృష్ట దేవత తన నెత్తిపై రూపం దాల్చింది. దురదృష్టం మృత్యువును రప్పించి మామ ప్రాణాల్ని గొనిపోయింది. తన జీవితమే తనకు దుర్భర మయింది. విచారం అతణ్ణి పీల్చి పిప్పి జేసింది. ఎంతకాలమని ఈ కూపంలో పడి కుమిలి కుర్చిపోతాడు. "ఈ విచారంతో ఎంతకాలమని నువ్విలా రాత్రింబవళ్లు నివసిస్తావు? తండ్రి నీకిచ్చిన ఆస్తినె వినియోగించి నీ దుఃఖాన్ని తొలగించుకో. అందుకోసమై పట్నం పో" అంటూ అంతరాత్మ ఆదేశించింది. అదే యీనాడు జగదీశుణ్ణి హతమారుస్తోంది. అంతరాత్మ జెప్పిన ప్రకారం ఆస్తి నంతటినీ అమ్మి పట్నం జేరాడు. కళాశాలా ప్రవేశం జగదీశుని జీవితంలో ఒక ఘట్టం. ఆనందజ్యోతి మెరుపులా మెరిసింది. జగదీశుడు తనకీ ఆనందమయ జీవితం లభిస్తుందని ఏనాడూ తలచలేదు. అంటే జీవితంలో కెల్లా గొప్పదైన యీ ఘట్టం జగదీశునిలో మార్పును ప్రకోపింప జేసింది. అదే యీనాడు మహావృక్షమై హృదయాఘాతంగా మారింది.

అవి కళాశాలలో చదువుతున్న రోజులు. ఆ సమయంలోనే అతనికి వసుమతితో పరిచయం ఏర్పడింది. జగదీశుడామెను ప్రేమించాడు. ఆమె కోసమై త్యాగాలు గావించాడు. తుదకు తన యావజ్జీవిత మంతా ఆమెతో గడపవలెనని నిశ్చయించాడు. ఆమెయే అతని హృదయారాధ్య దేవత.

వసుమతి గావించిన చర్య కతడు నిలువునా నీరయ్యాడు. ఆమె చిరుకోపం జగదీశున్ని వెర్రెత్తించింది. నవనాడులూ కృంగిపోయాయి. మరల వసుమతీ సంగమమవుతుందా? అని ఊహించాడు. వెనుకటి పాపమయిన కూపంలోకి మరొకసారి పోవాలా? జగదీశు డూహించిన ఊహలన్నీ మట్టి పాలవ్వాల్సిందేనా? అతడెంతో భాద జెందాడు.

జగదీశుడు ముఖం పైకెత్తి ఆకాశంవంక జూస్తున్నాడు. మౌనం ఆ గదినంతనీ ఆవహించింది. ఇంతలో తలుపు చప్పుడయినట్లు అలికిడయింది. కాని మౌనం వహించిన జగదీశునికి వినబడలేదు. "జగదీశ్" అందామె "ఏమిటాలోచిస్తున్నావు" అందా స్త్రీ కంఠం. ఉలిక్కిపడ్డాడు. మృదువైన ఆ పలుకులు జగదీశునిలో నూతనోత్సాహాన్ని జేకూర్చింది.

"ఏమిటి వసూ! నువ్విప్పుడిలా ఎందుకొచ్చావ్?" ఆతురతతో ప్రశ్నించాడు.

"జగదీశ్! నీలాటి వ్యక్తి లోకంలో లేదు. చాల ఉదార పురుషుడివి."

"వసుమతీ! నాకర్థమవడం లేదు" అన్నాడు అసలు విషయం తెలియక బిత్తర పోతూ.

"అర్థమవదు. కాని......?"

"ఎందుకు సందేహిస్తున్నావు" అన్నాడు జగదీశుడు. ఆమె చెక్కిళ్ళ వెంబడి అశ్రుధారలు ప్రవహిస్తున్నాయి. జగదీశుడు తత్తరపాటుతో "వసూ! వసూ! ఏమిటిది?

"నేను గావించిన చర్యకు నన్ను క్షమిస్తావా?" అంది గొంతు పూడిపోయినట్లుగా. జగదీశుడు ఆనందంతో పరవశుడయ్యాడు. చిరునవ్వు అతని ముఖాన్నెంతో అందంగా చేశాయి. కాని లాలనగా అతడు "ఎంతమాట! స్త్రీలకు కోపం సహజం! అంచేత దానిని ఉపహరించడం కోసమై పురుషుడు కృషిజేయాలి. ఆ కృషే యీ రూపంగా........?

"ఎప్పుడూ వేళాకోళాలేనా!" అంటూ ఆమె చిఱునవ్వుతో సిగ్గు జెందింది.

"వసూ! నీలాటి యువతితో స్నేహం లభించడం?"

"అవును. మీలాంటి పురుషులతో......?"

"ఈ జీవితమంతా యీ విధంగా గడిచిపోతే..."

అంటూండగానే జగదీశునికి వెనుకటి జీవితం గుర్తుకొచ్చింది.

"వసుమతీ! కారు చీకట్లుక్రమ్మిన నా జీవితారణ్యంలో వెలుగు బాటను జూపించావు. పాప భూయిష్టమయిన ప్రపంచంలో నేనొక్కడినీ మిగిలాను" అతని నేత్రాలు అశ్రు పూరితాలయ్యాయి.

"జగదీశ్! ఎందుకిలా విచారిస్తావు. మానవ జీవితంలో కష్టాలుంటాయి. వాటి నెదుర్కొని పోరాడడం మానవుని లక్షణం. అందుకోసమై ఇలా విచారిస్తూ..."

వసూ! కష్టాలపరంపరలు కట్టలు తెగి వర్షధారలా పడినప్పుడు వాటి భారం వహించవలసిందేనా? నన్ను ఏకాకి జీవితాన్ని గడపమని నా బంధువులందరూ మృత్యువుకు బలయ్యారు."

"జగదీశ్...!" ఆమె వదనం రంగుమారింది.

"నీ బాంధవ్యం అంతటితో ఆగిపోయింది. ఆనాడు నన్ను ఒదార్చేవారయినా లేకపోయారు. వసుమతీ! నువ్వీనాడు నా హృదయదేవతవై నన్నీ కష్టాల నన్నింటినీ మరిపించావు" అన్నాడు నిట్టూర్పువిడుస్తూ.

"జగదీశ్! విచారించకు. ఇక నేవెళ్ళొస్తా' నంటూ ఆమె అతడిముఖంవంక పరికించింది. దుఃఖంతో కుమిలిపోతున్న అతనిముఖం జేవురించింది.

"వసూ! నిన్ను కష్టపెట్టాను" అన్న మాటలు అతడి నుండి వెలువడ్డాయి. వర్షధారలా పడుతున్న కన్నీరు కాల్వలై ప్రవహిస్తోంది. వసుమతి అతడి స్థితిని గమనించి మెల్లగా దగ్గరకుజేరి కూర్చుంది.

మౌనం వారిద్దరిమధ్యా ఆవహించింది. గాఢాంధకారం నల్దిశలా విరజిమ్మి వారి మనస్థయిర్యాన్ని మరింత గాయపరిచాయి. టేబిల్ మీదవున్న గడియారం "నేనున్నా" నంటూ 'టిక్ టిక్' మంటూంది. నోరులేని జీవాల్లా కూర్చున్నారు ఒకరినొకరు చూసుకుంటూ. ధైర్యం చెప్పాలనుకున్న ఆమె అధైర్యయి చేలవడిపోయింది.

వసుమతి దేవతాప్రతిమలా కూర్చునివున్నది. ఆమె సౌందర్యం, అవయవసంపద, అజంతా, ఎల్లోరా గుహల్లోని శిల్పాల్ని గుర్తుకు తెస్తోంది. వంపులు తిరిగిన ఆమె నడుమొక లత. ఆమె ముఖం పద్మరాశి. కళ్ళనుండి ప్రకాశిస్తోందో జ్యోతి! పల్చని ఆమె దుస్తులలోనుండి తొంగిచూస్తున్న అవయవపుసొంపు చూపరులను ముగ్ధుల్ని చేస్తుందనడంలో ఆశ్చర్యమేముంది?

ముగ్ధలావున్న ఆజంతాసుందరి కదలింది. ఆమెప్రక్కనున్న అతడులేచి ఆమెను సాగనంపాడు. గుమ్మందగ్గరకు "మళ్ళా కనుపించేదెప్పుడు?" అన్నాడు తనేదో కోల్పోవుతున్నవాడిలా ముఖంపెట్టి. "రేపు ప్రొద్దున్నే" అంటూ ఆమె ముందుకు వయ్యారంగా సాగిపోయింది. జగదీశుడు చూపుమేరవరకూ ఆమెనలా చూస్తూనే వున్నాడు. జగదీశుడు తానునమ్మిన దైవాన్నెంతగానో పూజిస్తాడు. త్యాగాలు గావిస్తాడుగూడా!

ఈనాడు కలిగిన సంఘటన కెంతో గర్వపడ్డాను. గాని ఆమెను కష్టపెట్టి కన్నీరు గార్పించడం భావ్యమేనా? అన్న ప్రశ్న అతనిలో ప్రవేశించింది. ఏం? తన కష్టాల్ని తరుల్లతో జెప్పుకోకూడదా? అవును. భావి జీవితంలో ధైర్యాన్ని, స్థైర్యాన్ని కూడబెట్టుకుని జీవయాత్ర సాగించడానికి వెనుకటివి మరవడం స్వత సిద్ధమేగా! అలాంటప్పుడు కష్టాల్నితరులతో జెప్పి తేలిక జేసుకోవడం తప్పేనా? హృదయ దేవతయైన వసుమతితో—నా?

ప్రకృతి సహజమైన 'ప్రేమ' అలాంటి దేమో!

జగదీశుడా రాత్రి సుఖంగా నిద్రించాడు. తానెందుకో జెప్పలేని ఆనందాన్ని పొందాను. ఏమిటో వింత!

మరుసటి రోజున కాలేజికి పోబోయే ముందు జగదీశుని కేదో లేఖ అందింది. లేఖను చూడడం తోటే అతడి ముఖం విప్పారింది. కవరు విప్పకుండానే తన హృదయాని కత్తుకున్నాడు. ప్రేయసి వ్రాసిన లేఖ. కాని లేఖను చదివిన తత్క్షణమే అతని వదనం దుఃఖంతో కమిలి పోయింది.

"జదీగశ్ !"

నీకీ ఉత్తరం వ్రాయాలంటే నేనెంతో దుఃఖిస్తున్నాను. నా హస్తాలు వణుకుతున్నాయి. ఆనందమయ జీవితాన్ని గడుపుదామనుకున్న మనం వేరయ్యాం. కాని మనస్సులు మాత్రం మారవు. నే నీనాటికి నిన్ను ప్రేమిస్తున్నాను. జీవితంలో నిర్మించుకున్న ఊహా సౌధాలు కూలిపోయాయి. ప్రకృతి తారుమారయింది. ఆ రాత్రి నీ నుండి శలవు తీసుకుని వెళ్ళగానే టెలిగ్రాం వచ్చింది తల్లిగారి అస్వస్థత ఎక్కువైందని. ఆమె మరణించింది. గృహ బాధ్యతంతా నాపైన వుంది. నే నెక్కడకూ రావడానికి వీలుండదేమో !? ఈ నా జీవితంలో ఏనాడైనా నిన్ను కలుసుకుంటాను. నీ కోసమై నే నెంతో విచారిస్తున్నానో నా అంతరాత్మకు తెలుసు. ఏకాకివైనా నీవు నేను లేనిదే జీవింపలేవని తెలుసు. కాని విధి వ్రాత తప్పదు. నీకు బాధ కలిగించినందుకు క్షమిస్తావనుకుంటాను.

ఇట్లు
అభాగిని
వసుమతి

"వసుమతీ!" అంటూ హాలు బ్రద్దలయేటట్లు అరిచాడు అప్రయత్నంగా. అతడి కళ్లు ఎర్రబడ్డాయి. తలంతా విరజిమ్మి వుంది. వసుమతి స్తుతి అతడ్ని భావిస్తోంది. కొన్ని దినాలు- ఆమెను మరవాలనే ప్రయత్నం చేశాడు. కాని సాధ్యం కాదుగా ! ! !

జగదీశుడు మరింత ఆరాటం జెందాడు. ఆమెకోసమై అహోరాత్రాలు విచారించాడు. ఆమె వ్రాసిన లేఖ ప్రకారం ఆ వూరు వెళ్ళాడు. కాని వారందరూ మరొక చోటికి వెళ్ళారనే వార్త వినగానే దుఃఖం పెల్లుబికింది.

జగదీశుని ఈ నాటి స్థితే నాడు గలిగిన అనుభూతి. "వసుమతీ!" అంటూ రోడ్లవెంబడే ప్రయాణించాడు కొంతమంది పిచ్చివాడన్నారు. స్నేహితులంతా "ప్చ్ ! పాపం !" అనుకున్నారు.

ఒకనాడు నేను రోడ్డంబడే వెడుతున్నాను. చెట్టు నీడ నో వ్యక్తి కూర్చుని వున్నాడు. తలంతా చిందరవందరగా వుంది. దుస్తులన్నీ మట్టి కొట్టుకుపోయాయి.

"అహ్హా......హ్హా......వసూ ! భలే !...... నువ్వు రంభవి......కాదు కాదు......అప్సరసవి........."

అందోస్వరం వికటంగా.

## "మెలోడి" రికార్డులు

ఆంధ్ర ప్రజానీకానికి చిర పరిచితమైన గ్రామఫోను రికార్డుల కంపెని అయిన డచ్చిన్సు అండు కంపెని ప్రస్తుతం హచ్చిసన్ అండు కంపెని అనే కీ॥ శే॥ మ. అచ్చుత నాయుడు గారి కుమారులు మ. శ్రీనివాసులు నాయుడు గారి యాజమాన్యమున పునః ప్రారంభింపబడినది. మెలోడి రికార్డులని పేరు పెట్టియున్నారు. ప్రస్తుతం వారు గోకుల్ ప్రొడక్షన్సు వారి "కనక తార" లలితా పిలిమ్సు వారి "చరణదాసి" రాజ్యం పిక్చర్సు వారి "హరిశ్చంద్ర" జోయ - రేవతి వారి "బాల సన్యాసమ్మ కథ" మహి ప్రొడక్షన్సు వారి "శ్రీ గారి మహత్యం" శివకుమారి పిక్చర్సు వారి "స్త్రీ" చిత్రములలోని పాటలు అతి త్వరలో విడుదల చేయనున్నారు.

ప్రస్తుతము కన్యాదానం లోని పాటలును విడుదల చేసియున్నారు. లూరి మెలోడీ రికార్డులు ఆంధ్ర దేశమంతటా దిగ్విజయ యాత్ర సలుపుచున్నది.